# క్షమించు

"ఓ! ఏసుప్రభూ! యీ పాపిని క్షమించు!"

పురిటిగదిలోంచి మూలుగు వినపడుతోంది. బయట ఏసుదాసు నేలమీద మోకరిల్లి రెండు చేతులూ పైకెత్తి ప్రార్థించాడు—

'ఓ ఏసుప్రభూ! ఈ పాపిని క్షమించు!'

గదిలో ఏసుదాసు పెళ్ళాం మరియమ్మ పురిటినొప్పులు పడుతోంది. గదిబయట ఏసుదాసు ప్రాణాలు బిగపట్టుకొని ఆతురతతో, లోపలనుంచి వచ్చే ప్రతిశబ్దాన్నీ వింటున్నాడు.

మరియమ్మ ఈసారి పెద్దగా మూలిగింది. అతి దారుణంగా వున్న ఆ ధ్వని ఏసుదాసు గుండెల్ను చీల్చుకుపోయింది.

ఏసుదాసు లేచి, రెండడుగులు ముందుకు వేసి మూసివున్న తలుపు పక్కగా నుంచొని లోపలికి విన్నాడు.

నిశ్శబ్దం! భయంకరంగా వుంది.

మరియమ్మ మూలుగు వినపడడం లేదు! ఏసుదాసు గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

ఆ భయంకరమైన నిశ్శబ్దాన్ని చీల్చుకొని పసిబిడ్డ ఏడుపు వినిపించదేం?

ఏసుదాసు మనసు పంచేంద్రియాల్నీ కూడగట్టుకొని వినడానికి ప్రయత్నించింది.

మాయ తెరలను చించుకొని 'శిశురోదనం' తన చెవులకు వినిపించదేం ?

మమతలో పడిపోయిన అతని మనసూ, మైకంలో వున్న శరీరం, భయంతో చెదిరిపోతోన్న మెదడూ పసిబిడ్డ ఏడుపు వినడానికి ప్రయత్నంచేసినై;

క్షణాలు గడిచిపోతోన్నాయ్.

ఒకటీ—రెండూ—మూడూ—

ఏసుదాసుకు నరాలు విచ్చిపోతోన్నట్టయింది. శరీరం వణికిపోతోంది.

మెడ ముందుకు సాచి, ముఖాన్ని తలుపుచెక్కకు ఆనించి, సందుల్లోగుండా లోపలకు చూశాడు.

మరియమ్మ చాపమీద చలనరహితంగా పడి వుంది. ముఖంమీద శ్వేదబిందువులు, కిటికీలోంచి పడుతోన్న నీరెండకు ముత్యాల్లా మెరుస్తోన్నాయి.

దాది, మరియమ్మ కాళ్ళవైపు మౌనంగా కూర్చొనివుంది. ఏసుదాసు తల్లి, మరియమ్మ తలపక్కగా, ఆదుర్దాగా చూస్తో కూర్చొనివుంది.

దాది, ఏసుదాసు తల్లితో అంటోంది—

'భయపడమాకు ఆలీసూ! శోషవచ్చి మూర్ఛపోయినట్టుంది! ఇప్పుడే తెలుస్తుంది!'

"అయితే ఇంకెంత సేపటి కవుతుందంటావ్ ?"

"ఇంకో గంటకల్లా అయిపోవాలి!" అంది సాలోచనగా దాది.

"చూడు! మేరీ! మగపిల్లాడే పుట్టాడనుకొంటాను! మా లావునొప్పు లొస్తున్నాయి! మా ఏసోబు పుటకలకు యింత కంటే ఎక్కువ—!"

"ఉండవమ్మా! మనవడే పుట్టాళ్ళే! ముందు మనిషి మూర్ఛనుంచి తేరుకోనియ్!"

"మరియమ్మ మూర్ఛపోయింది." దాది మాటలు ఏసు దాసు చెవుల్లోకి దూసుకుపోయినై.

మూర్ఛపోయింది! మూర్ఛపోయింది!! ఏసుదాసుకు మెదడు కుతకుతా ఉడికిపోతోన్నట్టయింది. అతడి మనసు కాలపు తెరలను తోసుకొని భూతకాలంలోకి పరుగెత్తింది—

—"ఇదీ మడిసీ మూర్ఛ హైందిసార్!" అన్నాడు కానిస్టేబుల్ ఖాదర్ సాయిబు.

హెడ్ కానిస్టేబుల్ ఏసుదాసుకు గుండెలు చిక్కబట్టినై.

"అరె! ముందు నువ్వు వాన్ ఎక్కు!" ఏసుదాసు పుర మాయించాడు ముందు సీటులో కూర్చుంటూ. ఖాదరు గప్ చిప్‌గా వాన్ ఎక్కి కూర్చున్నాడు. కారు సాగింది.

ఆ రోజు హెడ్ కానిస్టేబుల్ ఏసుదాసు నాయకత్వాన, సింగరాయకొండ రైల్వేస్టేషన్ దగ్గర బియ్యపు మూటలు రహస్యంగా రవాణాచేసేవాళ్ళమీద దాడి జరిగింది.

—అవి కరువురోజులు. దేశమంతటా రేషనింగు ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి ధాన్యంరవాణా నిషేధించబడింది. కాని ధాన్యం రహస్యంగా చేరవేసేవాళ్ళ సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతూంది. రాత్రిళ్ళు లారీలూ, బళ్ళకొద్దీ ధాన్యాన్ని దొంగవ్యాపారులు చేరవేస్తోనేవున్నారు. బీదా బిక్కీ జనం, చిన్న చిన్న బియ్యపు మూటలు రైళ్ళల్లోనూ,

కాలినడకనా మోసుకొని కరువుప్రాంతాలకు తీసుకు పోతోన్నారు. ఇదే వృత్తిగా చేసుకొని కొంతమంది బతికేవాళ్ళు కూడా లేకపోలేదు.

అన్ని రహదారిమార్గాల్లోనూ, రైళ్ళల్లోనూ పోలీసు నిఘా ఎక్కువైంది. ఆ పరిస్థితుల్లోనే కానిస్టేబుల్‌గా వున్న ఏసుదాసుకు హెడ్డుగా ప్రమోషన్ అయింది. దాంతో ఏసుదాసు బరటాసాగించాడు. ఎనిమిదిమంది గల పోలీసుదళానికి నాయకత్వం వహించి నెల్లూరు – సింగరాయకొండ స్టేషన్‌ల మధ్య దాడి ప్రారంభించాడు. ఏసుదాసుదళం డ్యూటీలో వుందంటే బియ్యపుమూటలవాళ్ళకు హడల్‌గా వుండేది. అందులో ఏసుదాసు పావలా అర్ధకూ ఆశపడేరకం గాదు. దాంతో చిన్న చిన్న మూటలవాళ్ళ పని యిరుకున పడినట్టయింది. చాలమంది బియ్యం చేరవేసే పని మానేశారు. మిగతా వాళ్ళు కొత్తకొత్త పద్ధతుల్లో బియ్యపు మూటల్ను చేరవేయడం మొదలుపెట్టారు.

కూటిగింజలు చేరవేయడానికి వాళ్ళు వేసే కోటి ఎత్తులూ, ఏసుదాసు లాఠీదెబ్బలకు పటాపంచలయినై! చిన్న చిన్న స్టేషన్లలో రైలు ఆగగానే ఏసుదాసు తన పటాలాన్ని తీసుకొని రైలుపెట్టెల్లో సోదాకి తలపడేవాడు. బల్లలకింద, ప్రయాణీకుల పరుపు చుట్టలకింద, చెక్కలపైన, లావేట్రీలల్లోనూ—ఒకటేమిటి, పెట్టంతా సోదాచేసేవాడు.

కాని, కొన్ని రోజుల్నుంచీ ఏసుదాసు దెబ్బకు తట్టుకోలేక రైలు స్టేషన్ చేరకముందే ఆగిపోతూంది. అంటే బియ్యపు మూటలవాళ్ళు స్టేషన్ ఇంకో అరమైలు వుందనగానే గొలుసు లాగి ఆపి పారిపోవడం మొదలుపెట్టారు.

అయితే, ఏసుదాసు కళ్ళల్లో కారంగొట్టి పోగలగడం అంత సుసాధ్యమా ?

రైలుకట్ట పక్కనే వున్న ట్రంకురోడ్డుమీద కారు నిలిపి, రైలుకట్ట పక్కనున్న చేలల్లోనూ, గుంటల్లోనూ దాక్కుని ఏసుదాసు తన దళంతో పొంచివుండేవాడు.

—ఆ రోజు హెడ్‌కానిస్టేబుల్ ఏసుదాసు సింగరాయకొండ స్టేషన్‌కు అరమైలు దూరంలో రైలుకట్టపక్క దుబ్బలలో తన దళంతో పొంచివున్నాడు.

అప్పుడే సూర్యుడు అస్తమిస్తోన్నాడు. సంధ్యాకాంతులకు పడమటిదిక్కున వున్న ఆకాశం, చిట్టడవి మిలమిలా మెరుస్తోన్నాయి. తూర్పున వున్న దూరపు కొండల్లోంచి చీకటి మబ్బులు తరుముకు వస్తోన్నాయి.

రైలుబండి కొండచిలవలా మలుపులు తిరుగుతూ భారంగా వస్తోంది.

రేగుదుబ్బల చాటున పొంచివున్న ఏసుదాసు తన దళం వాళ్ళతో అన్నాడు :

"అదుగో ! బండి వస్తోంది ? జాగ్రత్త! ఇవ్వాళ ఒక్కళ్ళనుకూడా వొదలొద్దు!" కిర్‌గర్‌న శబ్దంచేస్తో బండి ఆగిపోయింది.

ఓ పదిమంది మొగాళ్ళూ, ఐదాదుగురు ఆడాళ్ళూ హడావుడిగా దిగి, దాదాపు పరుగులో చేలకడ్డంపడి వస్తోన్నారు.

మళ్ళీ రైలుసాగి భారంగా కదిలి పోయింది.

ఏసుదాసు రేగుదుబ్బ చాటునుండి 'రడీ!' అని కేక వేశాడు.

ఐదుగురు కానిస్టేబుల్సూ వొక గ్రూపుగానూ, మిగతా ముగ్గురు కానిస్టేబుల్సూ, హెడ్డూ ఒక గ్రూపుగానూ చీలి, పరుగెత్తుకుంటూపోయి రోడ్డువైపుకు వస్తోన్న వాళ్ళకు మార్గ మధ్యంలోనే అడ్డంతగిలారు.

అందులో నలుగురు మగాళ్ళు, వో యిద్దరు ఆడాళ్లు బియ్యపు మూటలు కిందపారేసి చెల్లాచెదురుగా పారిపోయారు.

మిగతావాళ్ళు పోలీసులకు పట్టుబడ్డారు.

ఏసుదాసు తన వెంటవున్న ముగ్గురు కానిస్టేబుల్సతో వెనగ్గా వస్తోన్న నలుగురు ఆడాళ్ళను చుట్టుముట్టాడు.

"బాబూ! రచ్చించండి! పేదాళ్ళం! నోటికాడా గింజలు!" అంటూ గొల్లున గోలపెట్టారు, ఆ నలుగు రాడాళ్లు.

"అరే చూస్తారేమోయ్! లాక్కోండి!" హుకుం చేశాడు ఏసుదాసు.

ఆడాళ్ళ భుజాలమీదనుంచి చిన్నచిన్న మూటల్నులాగి కిందపడేశారు పోలీసులు.

"అరే! ఖాదర్! అది చూశావా?" ఎత్తుగావున్న ఆడాళ్ల పొట్టలవైపు చూస్తూ సాలోచనగా అన్నాడు హెడ్డు.

"అవును సార్! హక్కడా కూడా పెట్టావుండార్!" అన్నాడు ఖాదర్.

"ఊ! చూస్తారేం" అన్నట్టు సైగచేశాడు ఏసుదాసు.

ఖాదరూ, వెంకటరెడ్డీ ఆడాళ్ళమీదకు దూకారు. వాళ్ళకు ఆడాళ్ళమీదకు పోవడమంట్లే మహాసరదా.

భయంతో వణికిపోతూ, లోలోపల తిట్టుకొంటూ, ముగ్గురాడాళ్లు చీరకుచ్చిళ్ల వెనకపొట్టకు కట్టుకువుంచిన చిన్నచిన్న సంచులు తీసి బయటవేశారు.

మధ్యవయసులో వున్న ఒక స్త్రీ ఏసుదాసు కళ్ళల్లోకి అదోమాదిరిగా చూస్తో అట్లాగే నుంచొనివుంది.

పక్కనవున్న ఆడాళ్ళు ఏదో చెప్పబోతున్నారు. ఏసుదాసు అది వినిపించుకోకుండానే వుగ్రుడై పోయి—

"ఓసేయ్! నీ టక్కులన్నీ నాదగ్గర సాగవ్? నీయమ్మ! తీయ్ ముందు!" అంటూ చేతిలోవున్న లాఠీతో ఆమె కడుపు మీద వొక్క పోటు పొడిచాడు.

"అమ్మో!" కేకవేసి కింద పడిపోయింది ఆమె.

మిగతా ఆడాళ్లు జ౦యిన తిట్లకు లంకించుకున్నారు.

అందులో వొక వయసుముదిరిన ఆడది అంది. 'ఓరి పాపిష్టోడ! నీ చేతులిరగ! నిండు చూలాలుగదా? నీ కళ్ళు పోయినయ్యా!'

"దొంగెత్తు ఏస్తుందేమో చూడు ఖాదర్!" సగం అనుమానం, సగం భయంతో అన్నాడు ఏసుదాసు.

"లేదుసార్! దొంగెత్తు గింగెత్తు కాదు! ఇదీ మడిసి మూర్ఛపోయింది!" అన్నాడు ఖాదరు పడిపోయిన ఆడదాన్ని పరీక్షగా చూసి.

ఏసుదాసు గుండెల్లో తత్తర బయలుదేరింది! కాళ్ళల్లో వణుకు పుట్టింది! బియ్యపు మూటల్నూ, మనుషుల్నూ అక్కడ వదిలేసి, కానిస్టేబుల్సును వాన్ ఎక్కమన్నాడు. తను ముందు సీట్లో కూర్చొని, మూర్ఛపోయిన స్త్రీని పరీక్షగా చూస్తోన్న ఖాదర్ను వాన్ ఎక్కమని ఆజ్ఞాపించాడు ఏసుదాసు.

వెనకబడి అరుస్తోన్న ఆడవాళ్ళ మాటలు వినిపించుకోకుండా, రోడ్డుమీద ఎర్రదుమ్ము లేపుతూ శరవేగంతో వెళ్ళిపోయింది పోలీసు వాన్.

ఆ తర్వాత కొన్నాళ్ళకు, హెడ్ కానిస్టేబులు ఏసుదాసు యిద్దరు కానిస్టేబుల్స్‌తో కలిసి వొక ఊరిబయటఉన్న టీ కొట్లో ఉచితంగా "గరం గరం" 'చా' రుచి చూస్తోండగా, దాదాపు పిచ్చిదానిలా ఉన్న ఒక స్త్రీ కొట్టుముందుకు వచ్చింది.

ఆమెను చూసేసరికి ఏసుదాసుకు తాగుతోన్న టీ కొలమారి, గుండెలు ఎగబాకి గొంతులోకి వచ్చినంత పనైంది.

"నీ గుద్దు మాడ! నా బిడ్డను నీ పొట్టన పెట్టుకున్నావ్? నా వుసురు నీకూ నీ పెళ్ళానికీ తగలకుండాపోతుందా?" అంటూ ఆమె చేతులెత్తి మెటికలు విరచటం మొదలుపెట్టింది.

"ఛా! లఛ్మి! నోరుముయ్!" అంటూ ఖాదరుసాయిబు లాఠీ తీసుకుని లేచాడు.

"పోనియ్ దాన్ని! పిచ్చిముండ!" అని ఏసోబు సైకెక్కి ఇతర కానిస్టేబుల్స్ వెంటరాగా, అదేపోత పోయాడు.

అప్పట్నుంచీ ఏసుదాసుకు ఆ దారిన రావడమంటే గుండెదడ. పై అధికారు లుండగా ఎప్పుడు తిట్టోందోనని భయం. అధికారరీత్యా తప్పనిసరిఅయి ఆ దారిన ఎన్నోసార్లు కార్లో గానీ, సైకిల్‌మీదగాగాని వెళ్ళాల్సివొచ్చేది.

ఆ ఊరి బయట టీకొట్టు పక్కగావున్న చింతచెట్టుకింద వున్న చుట్టు గుడిశల దగ్గరకు రాగానే ఏసుదాసు మనసులో అటు చూడకూడదనుకుంటూనే, అప్రయత్నంగా అటు చూసేవాడు. చెట్టుకింద గుడిశముందు పిచ్చిదానిలా కూర్చున్న ఆ ఆడదాని చూపులు తనపై పడగానే, ఏసుదాసుకు గుండెల్లో బాకులు గుచ్చి ఎత్తినట్టయేది.

ఆమెను చూడటం తటస్థించిన రోజు ఏసుదాసుకు అన్నం సయించేదిగాదు. రాత్రిళ్ళు మనోవేదనతో నిద్రపట్టేది కాదు.

తను పాపిష్టి! కడుపులో వున్న పసిబిడ్డను చంపాడు! తను శిశు హంతకుడు! ఆ పాపం తనకు తగలకుండాపోతుందా? ఏసుప్రభువు తనను క్షమిస్తాడా?

రాను రాను, రాత్రింబవళ్ళూ యిదే ఆలోచనైంది ఏసుదాసుకు.

ప్రతి ఆదివారం చర్చిలో—"ఓ ఏసుప్రభూ ఈ పాపిని క్షమించు!" అని మోకరిల్లి ప్రార్థించేవాడు.

"ఓ! ఏసుప్రభూ! ఈ పాపిని క్షమించు!" అంటూ ఏసుదాసు రాత్రిళ్లు నిద్రలో కలవరించేవాడు.

ఓరోజు రాత్రి మరియమ్మ, పక్కలోవున్న ఏసుదాసు చెవిలో ఆనందమిళితమైన సిగ్గుతో చెప్పింది తనకు "రెండో నెల" అని.

అది విని ఆనందవివశుడయిన ఏసుదాసుకు అంతలోనే వళ్ళుతెలియని భయం ఆవహించి శరీరం నీళ్లుకారిపోయింది.

తను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం జరుగుతుందా? మరియమ్మ కడుపులో వున్న శిశువు మరణించే జన్మిస్తాడా?—

మెదడులో రాక్షసనృత్యం చేస్తున్న ఆలోచనలకు తల పగలిపోతోన్నట్టయింది ఏసుదాసుకు. రెండు చేతులతో కణతలు నొక్కిపట్టుకొని—

"ఓ! ఏసుదేవా? నీ బిడ్డను రక్షించు!" అన్నాడు పక్కలో వున్న మరియమ్మ కలవరపడి మొగుణ్ణి చూసింది.

మరియమ్మ తన పొట్టమీద గాలిలో శిలవగుర్తును చూపుడువేలుతో గీసి—

'ఓ ఏసుదేముడా! నా బిడ్డను కాపాడు!' అని అమాయకంగా ప్రార్థించింది.

దినదినం మరియమ్మ గర్భంలో పెరుగుతోన్న శిశువుతో పాటు ఏసుదాసు కడుపులో చిచ్చు, హృదయంలో అశాంతీ, ఆవేదనా పెరుగుతోన్నాయి.

ఒక ఆదివారం రాత్రి చర్చినుంచి తిరిగి రాగానే ఏసుదాసుభార్య మరియమ్మకు, అంతవరకూ తన హృదయంలో అగ్నిజ్వాలల్ను వెదజల్లుతున్న బాధలగాధను వెల్లడించాడు.

విని మరియమ్మ విస్మయం చెందింది. రెండుచేతుల్ను రొమ్ములమీద ఆనించి—

"రక్షించు! రక్షించు! పాపుల్ను రక్షించు! ఏసు దేముడా! నా బిడ్డను కాపాడు!" అని దీనంగా ప్రార్థించింది.

మరియమ్మ చెక్కిళ్ళపైకి కారిన కన్నీళ్ళను తుడుస్తోన్న ఏసుదాసుకు తన హృదయంలో కొంత బరువు దింపుకొన్నట్టయింది.

రోజులు గడుస్తోన్నకొద్దీ ఏసుదాసు మనోవేదన వుపశమించకపోగా, మరియమ్మకూ్కడా దిగులు అధికం కాజొచ్చింది. పెరుగుతోన్న గర్భాన్ని చూసుకొని దినదినం మరియమ్మ ఏసుదేవుణ్ణి ప్రార్థించేది. దిగులు పెంచుకొన్న మరియమ్మ శరీరం కృశించసాగింది.

ఏసుదాసు డ్యూటీలో వున్నా, మరియమ్మ గర్భస్థ శిశువు అతని ఆలోచన లన్నిటినీ ఆక్రమించుకునేది. రోడ్డు పక్క చెట్టుకింద వున్న గుడిశముందు కూర్చుని చూసే ఆ పిచ్చిదాని చూపులే ఏసుదాసు హృదయాన్ని సతతం కలవర పరుస్తోండేవి.

మనస్థిమితం లేని ఏసుదాసుకు, నిత్యమూ తన ఆధ్వర్యాన జరిగే ప్రొహిబిషన్ దాడులు అతని మనసును ఇంకా

చికాకు పరచటానికి ఉపయోగపడుతున్నాయి. దొంగతనంగా సారా చేరవేసేవాళ్ళు రోజు కొక కొత్తపద్ధతిలో తీసుకుపోతున్నారు. ఇప్పుడిప్పుడు ఆడాళ్ళుకూడా ఈ వ్యాపారంలోకి దిగుతోన్నారు. కూరగాయ తట్టల్లోనూ, పెరుగు ముంతల్లోనూ తీసుకుపోవడం సాగించారు. కాని ఏసుదాసు ఆడాళ్ళను సోదా చేయాల్సి వచ్చినప్పుడల్లా తగు జాగ్రత్తలు తీసుకుంటూనే వున్నాడు. ఆ పిచ్చిదాని చూపులు ప్రతిసారీ గుర్తుకొస్తూనే వున్నాయి.

ఈ గొడవంతా పడలేక తనను ట్రాఫిక్ పొడ్డుగా బదిలీ చేయమని అధికారులకు అర్జీ పెట్టుకొన్నాడు. కాని తన మొగ ఆలకించేవాళ్ళేవరూ? ఆ ట్రాఫీక్ కానిస్టేబుల్ వెంకటయ్య పని యెంత హాయి? ఏ గొడవా లేకుండా తన పనేదో తను చేసుకుపోతున్నాడు—

"అమ్మో! ఉస్సూ! ఓయి దేవుడా? అమ్మో!"—గదిలో నుంచి వినవస్తోన్న మరియమ్మ మూలుగు ఏసుదాసు ఆలోచనా ప్రవాహానికి అంతరాయం కలిగించింది.

"మరియమ్మకు తెలివి వచ్చింది. మూర్ఛ తేరుకొంది! ఐతే యిహ పరవాలేదులే!" అని మనసులో అనుకొన్నాడు ఆశగా ఏసుదాసు.

ఇంతలో తడికి తోసుకొని బయటి కొచ్చింది దాది.

ఏసుదాసు ఆదుర్దాగా ఆమె ముఖంలోకి చూశాడు.

"ఏం పర్వాలేదు ఏసోబన్నా! ఇంకొంచెం సేపటికి అయిపోతుంది!" నుదురున కారుతోన్న చెమటను తుడుచుకొంటూ దాది చెప్పింది.

'నీ ఋణం ఉంచుకోనులే! బాగా శ్రద్ధగా సూడమ్మా!' ఏసుదాసు కంఠంలో కృతజ్ఞతా, ప్రాధేయతా ధ్వనించినై.

"అంతా ఆ ఏసుదేముడి దయ! ఆ ప్రభువుని తలచుకో!" అని దాది మళ్ళీ గదిలోకి వెళ్ళింది.

ఏసుదాసు మోకరిల్లి ఏసుదేవుణ్ణి తలుచుకొన్నాడు. అయితే శిలవకు వేసిన ఏసుక్రీస్తుకు బదులు చెట్టుకింద కూర్చుని వెర్రిగా చూసే ఆ స్త్రీమూర్తి ఏసుదాసు స్మృతి పథంలోకి వచ్చింది. ఏసుదేవుడి ప్రార్థనకు బదులు అతని చెవుల్లో ఆనాడు టీ దుకాణంముందు ఆమె తిట్టిన శాపవాక్యాలు ప్రతిధ్వనించాయి. తను ఆమె పొట్టమీద లాఠీతో పొడిచిన దృశ్యం కళ్ళ ముందు కన్పించసాగింది.

ఏసుదాసు రెండు కళ్ళూ మూసుకొని రెండు చేతుల్తో చెవులు నొక్కిపట్టి—

"ఓ ప్రభూ! క్షమించు! అట్లాంటి పని యిక నా జన్మలో చేయను!" అన్నాడు.

అలా మోకరిల్లిన ఏసుదాసు మనసు భవిష్యత్తులోకి దూసుకుపోయింది—

—పోలీస్‌వాన్ రోడ్డుమలుపులో ఆగింది. అప్పుడే చీకటితెరలు తొలగిపోతున్నాయి. రోడ్డుకు దూరంగా వున్న తాటితోపులోంచి మనుషులు నెత్తిమీద తట్టలు పెట్టుకొని రోడ్డువైపుకు వస్తోన్నారు.

సూపరింటెంట్ యీలవేశాడు.

టకటకా బూట్లశబ్దం, లాఠీలమోత!

బిలబిలా పారిపోతోన్న జనాన్ని ముట్టడివేశారు పోలీసులు.

"ఊ! ఏసుదాసూ! చూస్తావేం? లాగేసేయ్!" ఏసుదాసు మౌనంగా నుంచున్నాడు.

"ఏయ్! నీకే చెప్పేది! వాళ్ళు కడుపులకు సారా సీసాల్లో, రబ్బరు గొట్టాల్లోనూ పోసుకొని కట్టుకుపోతారోయ్!" పోలీసు అధికారి కఠినంగా చెప్పాడు.

ఏసుదాసు తటపటాయించాడు.

"యూ! ఫూల్! నీకేరా చెప్పేది?" అధికారి గర్జించాడు.

గర్భిణీస్త్రీలు వుంటారు సార్!" నసిగాడు ఏసుదాసు.

"షటప్! ఇడియట్! ఒరే టూ నాట్ టూ! దాన్ని సోదాచెయ్యరా!" అధికారి ఆజ్ఞాపించాడు.

"ఎస్సార్?" టూ నాట్ టూ వొక్కదూకు దూకాడు. పొట్ట ఎత్తుగా పెట్టుకొని గజగజా వణుకుతూ నుంచొన్న ఆడదానిమీదకు.

దాని చీరకుచ్చిళ్ళలోనుంచి దబదబా రెండు గుండ్రటి నిండుసీసాలు కిందపడినై!

అధికారి కళ్ళు చింతనిప్పుల్లా మెరిసినై! ఏసుదాసుకు కాళ్ళు వణికినై!

"నిన్ను రివర్ట్‌చేశాను!" అన్నాడు అధికారి.

"అసలు నాకీ వుద్యోగమే వద్దు! రాజీనామా ఇస్తాను!" ఏసుదాసు గొంతు వణికింది—

"కేర్! కేర్!" మని పురిటి గదిలోంచి పసిబిడ్డ ఏడుపు వినిపించింది.

—ఏసుదాసు మనసు భవిష్యత్తులోంచి వర్తమానంలోకి తిరిగివచ్చింది. అతని ఊహాదృశ్యాలు శూన్యంలో కలిసిపోయాయి.

పగటికలలు కరిగిపోయినై.

కేర్, కేర్! మని శిశువు రోదనం!

ఏసుదాసు హృదయం ఆనంద పులకితం అయి రోమాంచనం అయింది!

రెండు మోకాళ్ళూ భూమికి తాటించి, చేతులు పైకెత్తి ఏసుదాసు గొంతెత్తి ప్రార్థించాడు!

"మానవుల పాపాల్ని భరించటానికి ఈ లోకానికి దేవదూతవై వచ్చిన ఓ ఏసుప్రభూ! నా బిడ్డను కాపాడావు! కాదు ప్రభూ నీ బిడ్డల్ను కాపాడుకొన్నావు—"

ధడాలున పురిటిగదె తలుపులు తెరుచుకున్నై! వేడిగాలీ వాసనా బయటికి దూసుకు వచ్చినై.

దాది బయటికొచ్చి నుంచొంది.

ఆనందపారవశ్యంలో వళ్ళు మరిచిపోయి ఏసుదాసు దాది చేతులు పట్టుకొని అడిగాడు.

"అబ్బాయా? అమ్మాయా?"

"కొడుకే పుట్టాడులే!" దాది ముఖం వెలవెలపోయింది.

"ఏసుప్రభువు అనుగ్రహించాడు! పాపుల్ను క్షమించాడు!" ఏసుదాసు కళ్ళల్లో ఆనందబాష్పాలు రాలినై.

"ఓ ఏసుప్రభూ! పాపుల్ని క్షమించు!" అంటూంటే దాది ముఖంమీద విషాదచ్ఛాయలు ఆవరించాయి. కళ్ళల్లోంచి అశ్రువులు జారి చెక్కిళ్ళపైగా ప్రవహించాయి.

ఆర్ద్రమైన గొంతుకతో దాది అన్నది—

"మరియమ్మ-మరియమ్మ—" తరవాత గొంతు పూడిపోయింది! మాట పెగల్లేదు.

"ఆఁ! మరియమ్మా—" సందేహాస్పదంగా అన్నాడు ఏసుదాసు.

దాది మౌనంగా నుంచొని గదిలోకి చూసింది!

గదిలోనుంచి ఆలీసు ఏడ్పు గొల్లున వినిపించింది!

తడబడుతోన్న అడుగులతో ఏసుదాసు లోపలికి వెళ్లాడు.

మరియమ్మ భర్త ముఖంలోకి నీరసంగా అదోమాదిరిగా చూసి కళ్ళు మూసుకొంది.

ఆ చూపుల్లోని పోలికల్ను గ్రహించాడు ఏసుదాసు. అవి తనకు పరిచయమైన చూపులే; సరిగ్గా ఆలాగే చూసింది ఆ రోజున అభాగ్యురాలు!

ఏసుదాసు హృదయం ఘోషపడింది!

శాశ్వతంగా బాధావిముక్తురాలైన మరియమ్మ ముఖంలో నల్లరాతిలోని ప్రశాంతత ప్రస్ఫుటమయింది. వెలుగులోంచి మరియమ్మ చీకట్లోకి ప్రయాణం చేసింది.

అనంతకాలం చీకట్లో వుండి మొదటిసారిగా వెలుగును చూసిన మరియమ్మ శిశువు ఎందుకో బోసినవ్వు చిలకరించాడు.

భార్య మంచంపక్కన మోకరిల్లి ఏసుదాసు వెక్కి వెక్కి ఏడుస్తో అన్నాడు.

"ఎంత అన్యాయం ఏసుప్రభూ? ఎవరిది పాపం? ఎవరికి శిక్ష! ఎవరి పాపానికి ఎవరు కారణం?"

"ఓ ఏసుదేవుడా! మరియమ్మను నీలోకి తీసుకో!" ఏసుదాసు ప్రక్కన మోకరిల్లి తల్లి ఆలీసు ప్రార్థించింది.

"ఆమెన్ !" అన్నది దాది.

"ఆమెన్ !" అన్నది ఆలీసు.

"ఆమెన్ !" అన్నాడు ఏసుదాసు.

"ఆమెన్"